సాక్షి
మెదక్
బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



ఏడుపాయలకు రూ.100 కోట్లు

మంజూరు చేస్తూ జీఓ జారీ

ఏడుపాయల అభివృద్ధికి వంద కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో సీఎం కేసీఆర్ ఆలయ అభివృద్ధికి నిధులు అందిస్తానని ప్రకటించారు. ఇటీవల కలెక్టర్ కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం బహిరంగ సభలో ప్రస్తావించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి బుధవారం ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకొని పూజలు నిర్వహించనున్నారు. ఏడుపాయలకు వంద కోట్లు మంజూరు చేయడంపై సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించనున్నారు. - పాపన్నపేట(మెదక్)/మెదక్ మున్సిపాలిటీ

టెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు : అదనపు కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: ఈ నెల 15న నిర్వహించే టెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణపై డీఈఓ రాధాకిషన్, చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. మెదక్‌లో 18, రామాయంపేటలో 3 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతి లేదని, అరగంట ముందే చేరుకోవాలని డీఈఓ రాధాకిషన్ అన్నారు. హాల్ టికెట్‌పై అభ్యర్థి ఫొటో అంటించి గెజిటెడ్ అధికారితో ధ్రువీకరణ చేసుకోవాలన్నారు. సహాయ కమిషనర్ రామేశ్వర్ ప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి విజయలక్ష్మి, సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈఓ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పరిశోధనకు డాక్టరేట్



పీవీ సింధుతో పాండు

ఉస్మానియా యూనివర్సిటీ: బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు సక్సెస్‌పై చేసిన పరిశోధనకు గాను జంగం పాండుకు ఓయూ పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కోనాయిపల్లికి చెందిన పాండు ఓయూ వ్యాయామ విద్య సీనియర్ అధ్యాపకుడు ప్రొ.సత్యనారాయణ పర్యవేక్షణలో 'పీవీ సింధు-హర్ అచీవ్‌మెంట్స్ అండ్ కాంట్రిబ్యూషన్స్ ఇన్ ఇండియా-బ్యాడ్మింటన్ గేమ్- ఎ స్టడీ' అనే అంశంపై పరిశోధన చేశాడు. దీనికి గాను వ్యాయామ విద్య (ఫిజికల్ ఎడ్యుకేషన్)లో డాక్టరేట్ అందుకున్నారు.

16న అథ్లెటిక్స్ ఎంపికకు పోటీలు

మెదక్: పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 16న స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌కు ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మధు సుదన్ తెలిపారు. అండర్ 14, 16, 18, 20 బాల బాలికలకు త్రోబాల్, లాంగ్ జంప్, హై జంప్, రన్నింగ్ విభాగాల్లో ఎంపిక ఉంటాయన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 30న కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల వారు వయసు ధ్రువీకరణ పత్రం, విద్యార్హత మెమోతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 99630 05540 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రాజగోపురంలో పూజలు



దుర్గమ్మకు పూజలు చేస్తున్న పూజారులు

చేగుంట(తూప్రాన్): ఏడుపాయల వనదుర్గ మాతకు మంగళవారం రాజగోపురంలోనే పూజలు నిర్వహించారు. గర్భగుడి చుట్టూ మంజీరా వరద ప్రవహిస్తుండడంతో గుడిని మూసి వేసి ఉంచారు. పూజారులు రాజగోపురం వద్ద అమ్మవారికి పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సదరం కోసం దరఖాస్తు చేసుకోవాలి

మెదక్ కలెక్టరేట్: దివ్యాంగ ధ్రువీకరణ పత్రాల కోసం నిర్వహించే సదరం క్యాంపులో పాల్గొనేందుకు అర్హులు మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి తెలిపారు. సెప్టెంబర్ నెలకు సంబంధించిన తేదీలను మీసేవాకు అందించామని, కేటాయించిన తేదీల్లో హాజరు కావాలన్నారు.

తప్పుడు సమాచారమిస్తే చర్యలు తప్పవు

మెదక్ కలెక్టరేట్: బదిలీలు, ప్రమోషన్లలో ఉపాధ్యాయులు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తెలిస్తే చర్యలు తప్పవని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. ఇప్పటికే ఎవరైనా అలాంటి వివరాలు ఇచ్చి ఉంటే వెంటనే ఉపసంహరించుకోవాలని సూచించారు. విచారణలో రుజువైతే సీసీఏ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భార్యభర్తలు ఉద్యోగులైతే ఒకరు మాత్రమే స్పౌస్ ఆప్షన్‌ను వాడుకోవాలన్నారు.

కళ్లకు గంతలు కట్టి.. గంగిరెద్దుకు వినతిపత్రం ఇచ్చి



గంగిరెద్దుకు మెమొరాండం ఇస్తున్న ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: విద్యా శాఖ పరిధిలో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు కొనసాగిస్తున్నారు. మంగళవారం కళ్లకు గంతలు కట్టుకొని.. గంగిరెద్దుకు మెమొరాండం అందించి వినూత్నంగా నిరసన తెలిపారు. వీరికి మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి వీరికి మద్దతు తెలిపారు. శిబిరంలో కూర్చొని ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ తోడు ఉంటుందని, ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ హాజరుకు సన్నాహం



కూచన్‌పల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఫేసియల్ అటెండెన్స్ తీస్తున్న టీచర్

- ఫేస్ రికగ్నైజేషన్‌కు యాప్
- వివరాలు నమోదు చేస్తున్న టీచర్లు
- 2,328 విద్యార్థుల డేటా పూర్తి

మెదక్: సర్కారు బడుల్లో చదివే విద్యార్థుల హాజరును పక్కాగా నమోదు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. రిజిస్టర్‌లో అటెండెన్స్‌కు బదులు ఇక నుంచి ఫేస్ రికగ్నైజేషన్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. విద్యార్థుల ఫొటో తీసి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తే.. ఏ రోజు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారు, గైర్హాజరు అయ్యారనే వివరాలను జిల్లా అధికారులతో పాటు రాష్ట్రస్థాయి అధికారులు ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే వీలుంది. ఎక్కువ రోజులు పాఠశాలలకు రాని విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి సక్రమంగా బడికి వచ్చేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

పక్కాగా పర్యవేక్షణ

జిల్లాలో ప్రభుత్వ, లోకల్‌బాడీ, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ 898 ఉన్నాయి. ఇందులో 89,748 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థుల హాజరును పక్కాగా సేకరించేందుకు ప్రభుత్వం ఓ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో విద్యార్థి ఫొటో, వివరాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. పేరు, తండ్రి, గ్రామం, ఊరు, ఫోన్ నంబర్ తదితర వివరాలను నమోదు చేయాలి. ఈ కార్యక్రమంపై అవగాహన కోసం ఇప్పటికే జిల్లాలో కొంత మంది ఉపాధ్యాయులకు శిక్షణను కూడా అందించారు. రెండు రోజులుగా ఉపాధ్యాయులు యాప్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు 2,328 మంది వివరాలు పూర్తయ్యాయి. ఈ ఫేసియల్ రికగ్నైజేషన్‌తో సర్కారు బడుల్లో విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. విద్యార్థుల హాజరు ప్రకారం మధ్యాహ్న భోజనం ఎంతమందికి సిద్ధం చేయాలి, పౌష్టికాహారం పక్కాగా అందుతుందా? లేదా..అనేది తెలుసుకోవచ్చు. ఈ విధానంలో మంచి ఫలితాలు వస్తే దీనిని ఉపాధ్యాయులకు కూడా అమలు చేయనున్నట్లు తెలిసింది. మూరుమూల, గిరిజన తండా స్కూళ్లలో బోధన చేస్తున్న ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లకుండా హాజరు వేసుకుంటున్నారని, కొంతమంది తమకున్న రాజకీయ పలుకుబడితో మేనేజ్ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం అందుబాటులోకి వస్తే ఇలాంటి వాటికి చెక్ పెట్టొచ్చని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

వారంలో పూర్తి

విద్యార్థుల హాజరును పక్కాగా నమోదు చేసేందుకు వారి వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నాం. ఫేస్ రికగ్నైజేషన్ అటెండెన్స్‌తో పారదర్శకత పెరుగుతుంది. వారంలో జిల్లాలోని విద్యార్థుల రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తాం.
– రాధాకిషన్ డీఈఓ, మెదక్

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం



గిరిజనులతో కలిసి బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): బీఆర్‌ఎస్ వచ్చాకే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతోందని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రామాయంపేటలో పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని కలెక్టర్ రాజర్షిషాతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సీఎం సహకారంతో రామాయంపేటకు రెవెన్యూ డివిజన్ మంజూరు చేయించానని అన్నారు. మెదక్‌కు మెడికల్ కళాశాల, రామాయంపేటలో డివిజన్ కార్యాలయం, డిగ్రీ కళాశాలను త్వరలో మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. ఇటీవల సీఎం ప్రకటించిన రూ.25 కోట్లతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు పూర్తిచేస్తామన్నారు. అనంతరం డిప్యూటీ ఈఈగా నియమితులైన పాండురంగారెడ్డి ఎమ్మెల్యే, కలెక్టర్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, రామాయంపేట, నిజాంపేట ఎంపీపీలు బిక్షపతి, సిద్దరాంలు, జెడ్పీటీసీ సంధ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాపు యాదగిరి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బోనమెత్తిన ఎమ్మెల్యే

హవేళీఘనపూర్(మెదక్): హవేళీఘనపూర్ మండలం ఫరీద్పూర్‌తండా, శుక్లాల్‌తండాల్లో మంగళవారం సేవాలాల్ మహారాజ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి హాజరై గిరిజన వేషధారణలో అమ్మవారికి బోనం ఎత్తుకుని సమర్పించారు. అనంతరం సేవాలాల్ మహారాజ్ పూజల్లో పాల్గొన్నారు.

నెలాఖరులోగా రుణమాఫీ జమ

బ్యాంకర్ల సమీక్షలో కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: అకౌంట్ క్లోజ్ అయిన రైతులకు కొత్త ఖాతాలు తెరిచి రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా బ్యాంకు అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రుణమాఫీ పథకం అర్హులకు అందించేందుకు బ్యాంకు అధికారులు చొరవచూపాలని, పంట రుణాలు నెలాఖరులోగా రెన్యూవల్ చేయాలని సూచించారు. ప్రతీ రైతు బ్యాంక్ ఖాతా కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని, జీరో బ్యాలెన్స్ అకౌంట్స్‌తో డిజిటల్ బ్యాంకింగ్ సేవలందించాలన్నారు. పట్టణాభివృద్ధికి 366 స్వయం సహాయక సంఘాలకు రుణ లక్ష్యం రూ.3102.65 కోట్లకు గాను, 137 సంఘాలకు రూ.1148.90 కోట్లు అందించినట్లు పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోగా లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్, డీఏఓ గోవింద్, ఎస్సీఈడీ విజయలక్ష్మి, మెప్మా పీడీ ఇందిరా, ఎల్‌డీఎం మూర్తి, నాబార్డ్ డీడీ సిసిల్ తిమోతి, ఎల్‌డీఓ(ఆర్‌బిఐ) తాన్యాసంగ్మా, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

మెదక్: డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి, బ్లడ్ స్టోరేజ్ యూనిట్‌ను తనిఖీ చేశారు. బ్లడ్ యూనిట్ సేకరణకు క్యాంపులు నిర్వహించాలని, స్టాకు రిపోర్ట్‌ను బోర్డులో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, రెడ్ క్రాస్ సొసైటీల సమన్వయంతో శిబిరాలు నిర్వహించాలని డీఎం అండ్ హెచ్‌ఓకు సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు పెంచాలని, అనస్తీషియా, రేడియాలజీ నిపుణులు, పీజీ ట్రైనీ డాక్టర్లు తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని, ఆస్పత్రి ప్రాంగణంలో పరిశుభ్రత పాటించాలన్నారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌ఓ చందునాయక్, డీసీహెచ్‌ఓ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం: ఎస్పీ

తూప్రాన్: శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. మంగళవారం మండలంలోని యావపూర్ గ్రామంలో దాత సహకారంతో ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన 22 సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దని, బ్యాంకు వివరాలు, పిన్, ఓటీపీ నంబర్లు చెప్పొద్దని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ శివానందం, సర్పంచ్ నర్సింహ్మారెడ్డి, ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకోం

పీసీసీ అధికార ప్రతినిధి బాలకృష్ణ

మెదక్: జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ ఈ నెల 14న నిర్వహించే పట్టణ బంద్‌కు అందరూ మద్దతు తెలపాలని పీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ అన్నారు. మంగళవారం బంద్‌కు సంబంధించిన కరపత్రాన్ని కార్యకర్తలతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు జిల్లా అభివృద్ధికి అడ్డుపడుతున్నాడని, నీళ్లు, నిధులు, కార్యాలయాలను సిద్దిపేటకు తరలించుకుపోతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ నాయకుడు సుప్రభాత్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, హఫీజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగిరెడ్డి, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ సల్మాన్, మెదక్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ సంతాప్ప, వికలాంగుల జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్, కొండా సంజీవ్, పట్టణ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ చౌదరి, శ్రీశైలం, జాకీర్, మాదూర్ నవీన్, బాలరాజ్ గౌడ్, కోటి రాజు, మధుసూదన్, రాజు, మధుతారక్ తదితరులు ఉన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న మ్యాడం బాలకృష్ణ

న్యాయం చేయండి సారూ..

సీఐ కాళ్లమీద పడిన బాధితురాలు



సీఐ కాళ్ళమీద పడి వేడుకుంటున్న బాధితురాలు

వెల్దుర్తి(తూప్రాన్): అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు తక్కువ ధరకు తమ భూమిని లాక్కోవాలని చూస్తున్నాడని, న్యాయం చేయాలని బాధితురాలు సీఐ కాళ్ల మీద పడి వేడుకుంది. ఈ ఘటన వెల్దుర్తి మండలం హస్తాల్‌పూర్ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లికి చెందిన బొగ్గుల భిక్షపతి, జయలక్ష్మి దంపతులకు వెల్దుర్తి మండలం హస్తాల్‌పూర్ శివారులో 7.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో సుమారు నాలుగెకరాల స్థలాన్ని శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి అక్రమంగా కబ్జాచేశాడని, రక్షణ కల్పించాలని బాధితురాలు సోమవారం ఎస్పీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తూప్రాన్ సీఐ శ్రీధర్ మంగళవారం హస్తాల్‌పూర్ శివారులో విచారణ చేపట్టారు. తమ వ్యవసాయ బోరుబావిని సైతం స్వాధీనం చేసుకున్నాడని, అడిగితే బెదిరిస్తున్నాడని బాధితురాలు వాపోయింది. అదే గ్రామానికి చెందిన మరో రైతు కూడా నక్ష బాటను కబ్జా చేశాడని, పొలాల్లోకి వెళ్ళకుండా అడ్డుకుంటున్నారని వివరించారు. వారసత్వంగా వచ్చిన భూమిని ఆక్రమించిన వ్యక్తిపై చట్టపర చర్యలు తీసుకొని న్యాయం చేయాలంటూ.. సీఐ శ్రీధర్ కాళ్ళమీదపడి బాధితురాలు ప్రాధేయపడింది.

పరీక్షరాసి వస్తూ మృత్యుఒడికి..

అనంతసాగర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ముగ్గురు బీటెక్ విద్యార్థుల దుర్మరణం
- ఎనిమిది మందికి తీవ్ర గాయాలు



ప్రమాద స్థలంలో మృతదేహాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): వారంతా బీటెక్ విద్యార్థులు.. ఎంతో సంతోషంగా పరీక్షలు రాశారు. తోటి మిత్రులతో కలిసి క్వాలిస్ వాహనంలో వెళ్తుండగా మృత్యువు మాటువేసింది. వీరు ప్రయాణిస్తున్న వాహనం ఆగిఉన్న లారీని ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. చిన్నకోడూరు మండలం అనంతసాగర్ వద్ద మంగళవారం చోటుచేసుకున్న విషాదకర ఘటన వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణ శివారులోని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 11 మంది బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు రెండో సెమిస్టర్ పరీక్షలు రాస్తున్నారు. వారంతా కలసి తోటి మిత్రుడి క్వాలిస్ వాహనం తీసుకొని ఐదు రోజులుగా కరీంనగర్ వెళ్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం పరీక్ష రాసి తిరిగి వస్తున్నారు. సిద్దిపేట రూరల్ మండలం పెద్ద లింగారెడ్డిపల్లికి చెందిన తౌటి దేవచంద్(20) వాహనం నడుపుతున్నాడు. అనంతసాగర్ శివారులో రోడ్డు పక్కన పార్కు చేసిన ఇసుక లారీని అతివేగంగా వచ్చిన వీరి వాహనం ఢీకొంది. ప్రమాదంలో సిద్దిపేట పట్టణానికి చెందిన కళావిపిన్ చంద్ర (19), నేతి నాగరాజు(20), పయ్యావుల గ్రీష్మ(18) అక్కడికక్కడే మృతి చెందారు. నమ్రత (సిద్దిపేట), ప్రవళిక (దర్గపల్లి, నంగునూరు మండలం), చైతన్య (సిద్దిపేట), దేవచంద్ (పెద్దలింగారెడ్డి పల్లి)లకు తీవ్ర గాయాలు కావడంతో సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. బుద్ద సాయిచంద్ (చేగుంట), రోహిత్ రెడ్డి (రామాయంపేట), కర్రె రాజు(గజ్వేల్), సాయి నితిన్ (తిమ్మాపూర్, దుబ్బాక మండలం) సిద్దిపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపారు. ఈ ఘటన మృతుల కుటుంబాల్లో తీరని విషాదం నింపింది.

కొనసాగుతున్న ఉత్కంఠ

- నర్సాపూర్ టికెట్‌పై అస్పష్టత
- ఎటూ తేల్చుకోలేకపోతున్న కార్యకర్తలు



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సునీతారెడ్డి



కేటీఆర్‌తో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: నర్సాపూర్ బీఆర్‌ఎస్ టికెట్ కోసం ఆ పార్టీ నాయకులిద్దరూ ఎవరికి వారు ప్రయత్నాలు ప్రారంభించారు. సీటు కాపాడుకునేందుకు ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, ఎలాగైనా టికెట్ దక్కించుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి వారి వారి స్థాయిల్లో తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినా.. నర్సాపూర్‌ను మాత్రం పెండింగ్‌లో పెట్టింది. దీంతో టికెట్ ఎవరికి ఇస్తారనే అంశంపై ఆ పార్టీ కార్యకర్తల్లో అయోమయం నెలకొంది.

భరోసా ఇచ్చినా..

నర్సాపూర్ నియోజకవర్గ టికెట్ కోసం సునీతారెడ్డి, మదన్‌రెడ్డిలు ఎవరికి వారు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, ఎమ్మెల్సీ కవితను కలుస్తున్నారు. విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఈ నెల 11న సునీతారెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టికెట్ విషయమై మంత్రితో చర్చించారని, నిశ్చింతగా ఉండాలని మంత్రి హామీ ఇచ్చారని ఆమె అనుచరులు చెబుతున్నారు. అదే రోజు మంత్రి హరీశ్‌రావును కూడా కలిశారని, తమ నాయకురాలికే టికెట్ వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి మంగళవారం రోజున మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును హైదరాబాద్‌లో కలిసి టికెట్ విషయం చర్చించినట్లు తెలిసింది. నాన్నకు అన్నీ తెలుసని, ఆయనదే తుది నిర్ణయమని మంత్రి కేటీఆర్ చెప్పగా, ధైర్యంగా ఉండాలని హరీశ్‌రావు సూచించినట్లు సమాచారం. ఇద్దరు మంత్రులు హామీ ఇవ్వడంతో టికెట్ ఎవరికి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. మరోవైపు టికెట్ తమదేనని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతారెడ్డిలు వారి అనుచరులకు చెబుతుండడంతో కార్యకర్తలు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.

క్లుప్తంగా

అనుమానితులుంటే సమాచారమివ్వాలి

మనోహరాబాద్(తూప్రాన్): ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే తమకు సమాచారమివ్వాలని తూప్రాన్ సీఐ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండలం వెంకటాపూర్ అగ్రహారం గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 40 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సీఐ మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి, తూప్రాన్, వెల్దుర్తి, శివ్వంపేట్ ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఫిల్లింగ్ స్టేషన్ సీజ్

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి మండలం కుకునూర్ గ్రామ శివారులోని శ్రీ వేంకటేశ్వర ఫిల్లింగ్ స్టేషన్(పెట్రోల్ బంక్)ను మంగళవారం తూనికలు, కొలతల శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తనిఖీ చేశారు. గడువు ముగిసినా రెన్యూవల్ చేసుకోకుండా బంక్‌ను నిర్వహిస్తుండడంతో సీజ్ చేశారు.

విద్యుత్ షాక్‌తో నెమలి మృతి

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యుత్ షాక్ తగిలి నెమలి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓంకార్ సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ సమీపంలో ఓ నెమలి మృతి చెంది ఉండటం గమనించాడు. గ్రామస్తులతో కలిసి జహీరాబాద్ ఫారెస్టు అధికారి ఇనాయత్ అలీకి సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఆయన నెమలి మృతికి గల కారణాలను గ్రామస్తులను అడగగా, విద్యుత్ షాక్ తగిలి మృతి చెంది ఉండవచ్చని తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో హాస్టల్‌లో మంటలు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని సమీకృత హాస్టల్ భవనంలో మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి తృటిలో ప్రమాదం తప్పింది. కరెంట్ మీటర్‌వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో భయాందోళన చెందిన విద్యార్థులు బయటకు పరుగులు తీశారు. అదే సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, పీఏసీఎస్ అధ్యక్షుడు చంద్రం, సరాపు యాదగిరి, ఎస్‌ఐ రంజిత్, తదితరులు హాస్టల్‌వద్దకు చేరుకొని పరిస్థితి సమీక్షించారు. ఫైర్ ఇంజన్‌ను హాస్టల్ వద్దకు రప్పించారు. మంటలు చల్లారడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పరిశ్రమలో అగ్నిప్రమాదం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం పారిశ్రామిక వాడలో ఉన్న శ్రీ విలాస్ హైడ్రోటెక్ పరిశ్రమలో మంగళవారం స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అప్రమత్తమైన యాజమాన్యం ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్‌సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని యాజమాన్యం తెలిపారు. ఘటనా స్థలాన్ని బొల్లారం సీఐ నయిమొద్దీన్ పరిశీలించారు.

వ్యాపారులను వేధిస్తున్న ఐదుగురు అరెస్ట్

రామాయంపేట(మెదక్): విలేకరులుగా చలామణి అవుతూ డబ్బుల కోసం వ్యాపారులను వేధింపులకు గురిచేస్తున్న కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఐదుగురు వ్యక్తులను మంగళవారం రాత్రి నార్సింగి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండు కార్లలో వచ్చిన సదరు వ్యక్తులు రామాయంపేటలోని గోదాం నుంచి నార్సింగి రైసుమిల్లుకు ధాన్యం తరలిస్తున్న లారీని ఆపి తాము విలేకరులమని, ధాన్యం పత్రాలు చూపమని లారీ డ్రైవర్‌ను బెదిరించారు. దీనితో డ్రైవర్ ఈవిషయమై రైసుమిల్లు యజమానికి సమాచారం అందజేశారు. ఆయన అనుమానంతో నార్సింగి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించి గుర్తింపు కార్డులను పరిశీలించి వాటిని స్వాధీనపర్చుకున్నారు. ఈమేరకు ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు కార్లతో పాటు ఎనిమిది సెల్ ఫోన్లు, స్వాధీనపర్చుకున్నట్లు నార్సింగి ఎస్‌ఐ అహమ్మద్ మోహినుద్దీన్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరిశ్రమను పరిశీలిస్తున్న సీఐ నయిమొద్దీన్

ప్రోత్సాహం కరువు!

- మట్టి గణపతుల తయారీదారుల దీనస్థితి
- ఉచిత విగ్రహాల పంపిణీతో ఉపాధి కరువు
- ప్రభుత్వం సబ్సిడీ రుణం అందించాలని వేడుకోలు



మట్టి విగ్రహాల తయారీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వినాయక చవితి వస్తుందంటే చాలు గ్రామాలు, పట్టణాల్లో చిన్నా పెద్దా చేసే సందడి అంతాఇంత కాదు. గణపతి విగ్రహాల కొనుగోలుతోపాటు మండపాల ఏర్పాటు, డెకరేషన్ చేయడంలో ప్రతిఒక్కరూ బిజీ బిజీగా ఉంటారు. అయితే రంగులు, రసాయనాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించడం వల్ల జల కాలుష్యం ఏర్పడుతుందని, తెలంగాణ సర్కార్ మట్టి వినాయకులను నెలకొల్పేలా ప్రోత్సహిస్తుంది. ప్రతీ సంవత్సరం మున్సిపాలిటీల ఆధ్వర్యంలో మట్టి వినాయకులను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటుంది. దీనివల్ల మట్టి వినాయకుల తయారీదారులకు సరైన ఆదాయం లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందించి ప్రోత్సాహం అందించాలని వారు కోరుతున్నారు.

వినాయక చవితి సమీపిస్తుండడంతో తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రహదారులపై రంగురంగుల వినాయకుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పర్యావరణ పరిరక్షకులు, పండితులు మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని అవగాహన కల్పిస్తుండటంతో ఈ ప్రాంత ప్రజలు 35 ఏళ్లుగా మట్టి గణపతులను పూజిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. వీటిని నిమజ్జనం చేసినప్పుడు నీళ్లలో త్వరగా కరిగిపోయే అవకాశం ఉంటుంది. కొంత కాలంగా పాలకులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ప్రజలకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. కానీ, మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసేవారికి ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహం అందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్సిడీపై రుణాలు అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్‌లో నివాసముండే కుమ్మరి శంకర్ కుటుంబం 30 ఏళ్లుగా మట్టి విగ్రహాలను వివిధ రూపాల్లో తయారు చేస్తున్నారు. గతంలో విగ్రహాల తయారీకి కావాల్సిన బంక మట్టిని స్థానిక చెరువులో నుంచి తీసుకొచ్చేవారు. కానీ అవి కాస్త కాలుష్యం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు.

ట్రాక్టర్ బంకమట్టికి రూ.25 వేలు చెల్లిస్తున్నారు. దీని ద్వారా 8 ఇంచుల నుంచి 5 అడుగుల విగ్రహాలను తయారు చేస్తున్నారు. వీటిని సైజులను బట్టి రూ.35నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. 6 నెలల ముందు నుంచే విగ్రహాలను తయారు చేస్తున్నా అనుకున్న స్థాయిలో రాబడి రావడం లేదని తయారీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడం వలన తక్కువ ధరకే విగ్రహాలను అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందని వారు వాపోతున్నారు.

సబ్సిడీపై రుణం ఇవ్వాలి

30 ఏళ్లుగా మట్టి గణపతులను తయారు చేస్తున్నాం. తమకు శ్రమకు తగిన ఫలితం రావడం లేదు. పలువురు మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడం వలన మేము తక్కువ ధరకే విక్రయిస్తున్నాం. ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలి.

– కుమ్మరి శంకర్, మట్టి విగ్రహాల తయారీదారుడు, తెల్లాపూర్



జనవరి నుంచి మొదలుపెడతాం

జనవరి నుంచే మట్టి విగ్రహాల తయారి మొదలుపెడతాం. ప్రతీ ఏడాది సుమారు 4వేల విగ్రహాలను తయారుచేస్తాం. ఇందులో లాభాలు రాకపోయినా వృతిని కొనసాగిస్తున్నాం.

– కళ్యాణ్, వ్యాపారి, తెల్లాపూర్

అభివృద్ధికి తెలంగాణ దిక్సూచి

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



తొగుటలో పీఆర్ డీఈఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): తెలంగాణ అభివృద్ధి దేశానికి దిక్సూచిగా నిలిచిందని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు. తొగుటలో పంచాయతీరాజ్ శాఖ డివిజన్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తొగుట, రాయపోల్, దౌల్తాబాద్ మండలాలకు ప్రభుత్వం డీఈఈ కార్యాలయం మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు. తొగుట సబ్ డివిజన్ ఏర్పాటుతో మూడు మండలాలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఉపఎన్నికలో ఓడిపోయినా దుబ్బాక అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టంచేశారు. అనంతరం మండలంలోని వెంకట్రావుపేట ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు పత్రాలను ఎంపీ అందజేశారు. అలాగే తుక్కాపూర్, వెంకట్రావుపేట గ్రామాలకు చెందిన నర్సయ్యకు, నజీమొద్దీన్‌లకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ జడ్పీటీసీ రణం జ్యోతి, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, సర్పంచ్‌లు కొండల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య, నర్సింలు, ఎంపీటీసీ సభ్యులు స్వామి, నర్సింలు, శరత్, కోఆప్షన్ సభ్యుడు కలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లతో వెట్టిచాకిరీ

ఎమ్మెల్యే రఘునందన్‌రావు



అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లతో వెట్టిచాకిరీ చేయిస్తుందని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం దుబ్బాక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు సంబంధం లేని పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఓటర్ నమోదుతో పాటు చాలా పనులకు వినియోగించుకుంటూ వారి న్యాయమైన డిమాండ్లను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వారికి మద్దతుగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్, మచ్చ శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

బతుకమ్మ ఆటతో నిరసన

దుబ్బాకలో బతుకమ్మ ఆటతో అంగన్‌వాడీలు ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. సుమారు 2 గంటల పాటు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట తమ డిమాండ్లు పరిష్కరించాలని పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు భాస్కర్, పద్మ, నాగరాణి, భూలక్ష్మి, బసవరాణి, రమ, విజయ తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా కేసుల పరిశోధన

సిద్దిపేట సీపీ శ్వేత



మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: పారదర్శకంగా కేసుల పరిశోధన ఉండాలని, పెండింగ్‌లో ఉన్న సీసీ నెంబర్లు త్వరగా తీసుకోవాలని సిద్దిపేట సీపీ శ్వేత అన్నారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు అధికారులతో పెండింగ్ కేసులు, ఫంక్షనల్ వర్టికల్‌పై సీపీ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోర్టులో పెండింగ్ గ్రేవ్ ట్రయల్ కేసులు డిస్పోజల్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 2021, 22 సంవత్సరంలో అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులు త్వరగా డిస్పోజల్ చేయాలని సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్ ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ పోలీసు స్టేషన్లుగా ఎంపిక కావడానికి అధికారులు, సిబ్బంది పోటీపడి విధులు నిర్వర్తించాలన్నారు. సీసీటీఎన్ఎస్ ద్వారా ప్రతి దరఖాస్తు వివరాలు నమోదు చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు అడ్మిన్ శ్రీనివాసరావు, లా అండ్ ఆర్డర్ మల్లారెడ్డి, మహిళ పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, హుస్నాబాద్ పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నా.. ఏదీ రక్షణ?

- కొమురవెల్లి ఆలయంలో సీసీ కెమెరాల సిస్టం ధ్వంసం
- గుడి ఆవరణలో పనిచేయని కెమెరాలు
- సిబ్బందే ధ్వంసం చేశారని ఆలయ చైర్మన్ ఆరోపణ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సీసీ కెమెరాలకు సంబంధించిన సిస్టం(ఎస్‌వీఆర్) ధ్వంసమైంది. దీంతో దేవాలయంలోని 32 కెమెరాలు పని చేయడం లేదు. గుడి పరిసరాలలో పనిచేసే సీసీ కెమెరాల సిస్టం యూనిట్‌ను ఏఈవో గదిలో అమర్చారు. ప్రస్తుతం దీనిని పగులకొట్టడంతో సీసీ కెమెరాలు పని చేయక నిత్యం స్వామివారి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులకు రక్షణ కరువైంది. ఎవరో కావాలనే ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసినట్లుందని టెక్నీషియన్ చెబుతున్నాడు. దీంతో ఆలయంలో సిబ్బందిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వారం క్రితం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల గొడవ గురించి సీసీ ఫుటేజీ తీసుకుందామని మంగళవారం టెక్నీషియన్‌ను పిలిపించగా ఎస్‌వీఆర్ ధ్వంసమైన విషయం తెలిసింది. ఆలయ చైర్మన్ గీస భిక్షపతి వెంటనే విలేకరుల సమావేశం నిర్వహించి ఉద్యోగులే సీసీ కెమెరాల సిస్టం యూనిట్‌ను ధ్వంసం చేశారని ఆరోపించారు. కొద్దిరోజులుగా ఈయనకు, ఏఈఓ అంజయ్య మధ్య విభేదాలు తలెత్తడంతో ఆలయంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియకుండా ఉంది.



ధ్వంసం అయిన సిస్టం యూనిట్

ఇది ఆలయ సిబ్బంది పనే..

ఆలయంలో పనిచేసే సిబ్బందే సీసీ కెమెరాలు పని చేయకుండా చేశారు. వీటి సిస్టం యూనిట్ ఏఈఓ అంజయ్య గదిలో ఉంది. ఆయనే కావాలని ధ్వంసం చేశారు. గతంలో కూడా డాటాను డిలీట్ చేశారు. దీనిపై దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తా.

– గీస భిక్షపతి, ఆలయ చైర్మన్



కక్ష సాధింపు చర్యలు

ఆలయంలో సీసీ కెమెరాల సిస్టంను ధ్వంసం చేయవలసిన అవసరం నాకు లేదు. చైర్మన్ కావాలనే కక్ష సాధింపు చర్యకు పాల్పడుతూ నాపై ఆరోపణలు చేస్తున్నారు. నాకు ఎలాంటి సంబంధం లేదు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి విషయాన్ని బహిర్గతం చేయాలి. చైర్మన్ గీస భిక్షపతే ధ్వంసం చేయించి నాపై నిందలు వేస్తున్నారు.

– అంజయ్య, ఏఈఓ

హత్యా.. ఆత్మహత్యా..?

- అనుమానాస్పద స్థితిలో యువతి మృతి
- రైలు పట్టాలపై మృతదేహం లభ్యం



నందిని(ఫైల్)

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అల్లీపూర్ వద్ద రైలు పట్టాలపై అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన యువతి శవాన్ని మంగళవారం రైల్వే పోలీసులు గుర్తించారు. వికారాబాద్ రైల్వే పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. జహీరాబాద్ మండలం కొత్తూర్(బి) గ్రామానికి చెందిన మడపతి వీరయ్యస్వామి ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురి వివాహం కాగా, రెండో కుమార్తె మడపతి నందిని(20) హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటుంది. నగరంలో ఉంటున్న ఆమె అల్లీపూర్ వద్ద రైలు పట్టాలపై శవమై కనిపించింది. వికారాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం వద్ద లభించిన సెల్‌ఫోన్‌లోని నంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నందిని ఆత్మహత్య చేసుకుందా..? ఎవరైనా హత్యచేశారా..? అనే విషయం తెలియాల్సి ఉంది. తండ్రి వీరయ్యస్వామి ఫిర్యాదు మేరకు వికారాబాద్ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య



బాలయ్య (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): అప్పుల బాధ తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతెలో మంగళవారం జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నీల బాలయ్య (48) తనకున్న రెండు ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ భార్య కనకవ్వ, ముగ్గురు కొడుకులు బాల్‌రాజు, నాగరాజు, వేణును పోషించుకుంటున్నాడు. మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సుమారు రూ.3లక్షల వరకు అప్పు చేశాడు. వ్యవసాయం కోసం మరికొంత అప్పు చేశాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం తెలియక బాలయ్య మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి తాను చనిపోతున్నానని రెండో కుమారుడు నాగరాజుకు ఫోన్ చేసి తెలిపాడు. కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే బాలయ్య చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భూంపల్లి ఎస్‌ఐ భువనేశ్వర్‌రావు తెలిపారు.

ఏసీ రిపేర్ నెంబర్ కోసం వెతికితే..

రూ.2.96 లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లు



పటాన్‌చెరు టౌన్: ఏసీ రిపేర్ కోసం గూగుల్లో నెంబర్ కోసం శోధించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సైబర్ వలలో చిక్కుకుని రూ.2.96 లక్షలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశంకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సెప్టెంబర్ 9న ఏసీ రిపేర్ చేసే వారి కోసం గూగుల్లో శోధించాడు. ఈ క్రమంలో బాధితుడికి ఓ ఫోన్ నెంబర్ కనిపించగా దానికి కాల్ చేశాడు. దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా ఓటీపీలు చెప్తూ వచ్చాడు. దీంతో అతని ఖాతాలో ఉన్న రూ.2.96లక్షలు మాయమయ్యాయి. బాధితుడు మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం మంగళవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛ్ బడి అద్భుతం: యూనిసెఫ్ బృందం



స్వచ్ఛ్ బడిని సందర్శించిన విదేశీ బృందం

సిద్దిపేటజోన్: సిద్దిపేటలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ్ బడి అద్భుతంగా ఉందని యూనిసెఫ్ బృందం కితాబు ఇచ్చింది. మంగళవారం వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు జిల్లాలో పర్యటించారు. ఇందులో భాగంగా స్వచ్ఛ్ బడిని సందర్శించారు. వారికి జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, కమిషనర్ సంపత్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వచ్ఛ్ బడిలో క్లాత్ బ్యాంక్‌ను పరిశీలించారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చే క్రమంలో అందరూ జ్యూట్ బ్యాగ్స్, క్లాత్ బ్యాగ్స్ వాడేలా చైతన్యవంతం చేస్తున్న విషయాన్ని బల్దియా అధికారులు బృందానికి వివరించారు. స్టీల్ బ్యాంక్ ఏర్పాటు, చెత్త ద్వారా సేంద్రియ ఎరువుల తయారీ, రుతు ప్రేమ అమలు తీరు గురించి వారికి తెలియజేశారు. అనంతరం స్వచ్ఛ్ బడిలో నర్సరీ, గోశాల, సేంద్రియ ఎరువుల తయారీ ప్రక్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా స్పెయిన్ దేశ ప్రతినిధి ఓన మాట్లాడారు. తన భర్త రవికుమార్ భారత్‌కు చెందిన వ్యక్తి కావడంతో మెట్టినిల్లుకు వచ్చిన అనుభూతి ఉందన్నారు. తనకు ఇక్కడి పద్ధతులు అంటే చాలా ఇష్టమని అన్నారు. కార్యక్రమంలో లిడిజ, తానియా, మార్టిన్హో, టాప్స్ ,వాన్, కుపర్, ఓటినో, ఫెనండో, టిమో, డ్యూక్, సైమన్ తదితరులు పాల్గొన్నారు.

ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టి..

కారు డ్రైవర్ మృతి

పటాన్‌చెరు టౌన్: ముందు వెళ్తున్న వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగేశ్వరావు తెలిపిన వివరాలు. అమీన్‌పూర్ మండల పరిధిలోని నవ్యనగర్‌కు చెందిన పటేల్ శ్రీనివాస్(45) క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున లింగంపల్లి వైపు నుంచి సంగారెడ్డి వైపు కారు డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తున్న శ్రీనివాస్ పటాన్‌చెరు మండలం ముత్తంగి చర్చి సమీపంలో ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని..

పటాన్‌చెరు టౌన్: లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగలక్ష్మి తెలిపిన వివరాలు. మధ్యప్రదేశ్‌కు చెందిన గోపాల్ టైగ(53) పటాన్‌చెరు ప్రయాణ ప్రాంగణం ఎదుట జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో అతన్ని లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి జేబులోని ఆధార్ ఆధారంగా మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధి ఉసిరికపల్లి బస్టాండ్ సమీపంలోని తూప్రాన్- నర్సాపూర్ హైవేపై సోమవారం రాత్రి జరిగింది. ఉసిరికపల్లి గ్రామానికి చెందిన కుందనపల్లి మరియా, స్వామి దంపతులు వస్తున్న బైక్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సిద్దికి మోంది వస్తున్న బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో స్వామి తలకు తీవ్ర గాయాలు కాగా, సయ్యద్ సిద్దికి మోంది కాలు విరిగింది. స్థానికులు వారిని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

శివ్వంపేట(నర్సాపూర్): చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి గల్లంతు కాగా, మంగళవారం మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. దొంతి గ్రామానికి చెందిన బాలోల్ల కృష్టయ్య(55) సోమవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం శభాష్‌పల్లి పంచాయతీ పరిధిలోని పిల్లిగుండ్ల మత్తడి కుంటలో కృష్టయ్య మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. చేపలు పట్టేందుకు కుంటలోకి దిగి ప్రమాదవశాత్తు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య కృష్టమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావ్ తెలిపారు.

జరిమానా వేస్తారనే భయంతో..

రామాయంపేట(మెదక్): చోరీ కేసులో పట్టుబడిన ఓ వ్యక్తి జరిమానా వేస్తారనే భయంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని ప్రగతి ధార్మారంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన బండారి యాదాగౌడ్ (42)కు భార్యాపిల్లలున్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసై ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. ఈనెల 9న గ్రామంలోని పెద్దమ్మ గుడిలో చోరికి ప్రయత్నించి గ్రామస్తులకు పట్టుబడ్డాడు. గ్రామంలో పంచాయతీ నిర్వహించి జరిమానా వేస్తారనే భయంతో 10వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయిన యాదాగౌడ్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతదేహం మంగళవారం తేలింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్య సమస్యలతో..



బ్రిజ్‌నందన్ ప్రసాద్ (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): అనారోగ్య సమస్యల కారణంగా ఓ వ్యక్తి భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ నయిమొద్దీన్, స్థానికులు తెలిపిన వివరాలు. బిహార్ రాష్ట్రానికి చెందిన బ్రిజ్‌నందన్ ప్రసాద్(65) కుటుంబంతో కలసి బొల్లారం బాలాజీనగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. స్థానికంగా ఓ పరిశ్రమలో పనిచేసేవాడు. ఆరు నెలల నుంచి ప్రసాద్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. మంచానికే పరిమితం కావడంతో మనస్తాపం చెంది నివాసం ఉంటున్న ఐదంతస్తుల భవనం నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుటుంబ సమస్యలతో..



దుర్గయ్య (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మంగళవారం అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు. చిల్వెర గ్రామానికి చెందిన జిల దుర్గయ్య(35) ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక గత నెల 27న ఇంట్లో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతన్ని జోగిపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.